క్లుప్తంగా

నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు

చల్లపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి 2024–25 సంవత్సరానికి 50 శాతం సబ్సిడీతో కూడిన రుణాల కోసం వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణ మంగళవారం తెలిపారు. రెండు రోజులు పరిశీలన జరుగుతుందని బుధవారం ఉదయం 10 గంటల నుంచి చల్లపల్లి మండల పరిధిలోని ఆముదార్లంక, మాజేరు, మంగళాపురం, పాగోలు, నడకుదురు, పురిటిగడ్డ, వక్కలగడ్డ, వెలివోలు, యార్లగడ్డ మధ్యాహ్నం 2 గంటల నుంచి లక్ష్మీపురం ప్రాంతాలకు చెందిన అర్జీదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 3వ తేదీ ఉదయం 10 గంటల నుంచి చల్లపల్లి ఏరియాలోని అభ్యర్థులకు నిర్వహిస్తామని వివరించారు. అన్ని బ్యాంకుల మేనేజర్లు హాజరు కావాలని కోరారు. వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఈ సమాచారాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



చల్లపల్లి: ఖాతాదారులకు మెరుగైన సమర్థమైన సత్వర సేవలు అందించడమే బ్యాంకు లక్ష్యమని సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ పి.రమేష్ అన్నారు. మంగళవారం బ్యాంకు అధికారులు ఆటోపై మైక్ ప్రచారంతో చేయడంతపాటు చల్లపల్లిలోని షాపులకు వెళ్లి బ్యాంకు అందిస్తున్న సేవలను గురించి వివరించారు. మేనేజర్ రమేష్, అసిస్టెంట్ మేనేజర్ యార్ల మౌనిక మాట్లాడుతూ తక్షణ అవసరాలకు ఇంటి వద్దనే బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో క్యాషియర్ జితేంద్ర, గోల్డ్ అప్రైజర్ నాగబాబు, సహాయక సిబ్బంది అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ డీకే బాలాజీ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో మచిలీపట్నం పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నంలో డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు 27 రోజులుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరంలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగాలని చెప్పారు. డంపింగ్‌యార్డులో చెత్తను జాప్యం చేయకుండా తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ ప్రతి రోజూ 36 వేల టన్నుల చెత్త లోడ్ చేస్తున్నామన్నారు. డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు జరుగుతుండటంతో పారిశుద్ధ్య పనుల్లో కొంత ఆలస్యమవుతోందని, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సమావేశం జరగాల్సి ఉన్నందున కృష్ణా జిల్లాకు రెండు కాంపాక్టర్లు రానున్నాయని వివరించారు. ప్రస్తుతం 100 తోపుడు బండ్లను కార్మికులకు ఇచ్చామని, వాటి ద్వారా ఆయా డివిజన్లలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఆర్డీవో సీహెచ్ పద్మాదేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్‌సీ ఆనంద్‌కుమార్, బీసీ సంక్షేమశాఖాధికారి వి.రమేష్, గిరిజన సంక్షేమశాఖాధికారి ఎం.ఫణిదూర్జటి, మార్కెటింగ్ ఏడీ ఎల్ నిత్యానందం, తహసీల్దార్లు మధుసూదనరావు, నాగభూషణం పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

మహిళా పీఎస్ సీఐ వెంకటేశ్వరరావు

కోనేరుసెంటర్: బాలికలకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని మచిలీపట్నం మహిళా పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వాస వెంకటేశ్వరరావు తెలిపారు. బందరు మండలం పోతేపల్లి పంచాయతీ పరిధిలోని బీసీ గురుకుల పాఠశాలలో మంగళవారం మహిళలు – చట్టాలు, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్‌క్రైం, శక్తి మొబైల్స్ యాప్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారిపై జరిగే దాడులు, లైంగిక వేధింపులు, ఇతర అకృత్యాలను ఎదురించి నిలవాలన్నారు. మహిళల కోసం ఉన్నత న్యాయస్థానంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలను అమలులోకి తీసుకువచ్చిందన్నారు. బాలికలు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌ల గురించి పూర్తిగా తెలుసుకోవడం చాలా అవసరమన్నారు. తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సైబర్‌నేరాలు తదితర అంశాలపై బాలికలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, ఎస్సై రమేష్, శక్తి టీం సిబ్బంది, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఐక్యం' వైస్‌చైర్మన్ శ్వేతకు బంగారు నంది అవార్డు



బంగారు నంది అవార్డు, ప్రశంసా పత్రం అందుకుంటున్న శ్వేత

మచిలీపట్నంటౌన్: మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారు ఉగాది పండుగను పురస్కరించుకుని ఏటా ఇచ్చే బంగారు నంది అవార్డు మచిలీపట్నంకు చెందిన ఐక్యం ఫౌండేషన్ వైస్ చైర్మన్ ఆకూరి శ్వేతను వరించింది. హైదరాబాద్ లకడీకపూల్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఇటీవల జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో అవార్డును శ్వేత అందుకున్నారు. ఆమెను పలువురు నగర ప్రముఖులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వీధి బాలలకు, వృద్ధాశ్రమంలో ఉండే సేవలందించటంలో శ్వేత ముందుంటారని కొనియాడారు. సామాజిక సేవాకార్యకర్త శ్వేతకు బంగారు నందిని, ప్రశంసా పత్రాలను ప్రముఖ హాస్య నటుడు, మాజీ మంత్రి డాక్టర్ బాబూమోహన్, పలువురు టీవీ సీరియల్స్ నటుల చేతుల మీదుగా ప్రదానం చేయటం అభినందనీయమన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట పూజలు

బంటుమిల్లి: సాతులూరులో కొలువై ఉన్న శ్రీభమరాంబసమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ట పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్టీ శిష్ట పవన్‌కుమార్ పర్యవేక్షణలో పలువురు దంపతులు దీక్షాధారణలతో ఉదయం విఘ్నేశ్వరపూజ, అంకురారోపణ, యాగశాల ప్రవేశం పూజలు, సాయంత్రం ధ్వజారోహణ, అగ్నిప్రతిష్టాపన తదితర హోమాలు నిర్వహించారు. వేదపండితులు సోమరాజుపల్లి ఈశ్వర్‌నాగకుమార్ శర్మ శిష్య బృందం వేదమంత్రాల మధ్య ప్రతిష్ట పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

ప్రకృతి వ్యవసాయం మానవాళికి మేలు

గూడూరు: ప్రకృతి వ్యవసాయంతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని కలపటం సర్పంచి ఐనాల దేవనాగ శ్రీనివాస్ అన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి కలపటం గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో పచ్చిరొట్ట వేయడంతో పొలంలో భూసారం పెరగటంతో పాటుగా వేసవి తాపం తగ్గించడానికి దోహదపడుతుందన్నారు. రైతు కుటుంబ ఆదాయం పెరగాలంటే రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. డీఎంఎంటీ ఒ.స్వామిబాబు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడండి

అవనిగడ్డ: వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పెదకళ్లేపల్లి స్కీంకు మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని, చింతకోళ్ల–మందపాకల నుంచి అదనపు పైపులైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవరకోటలో పైపులైన్ మార్చాలని, యండకుదురులో విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డీఈ సత్యనారాయణ, ఘంటసాల, చల్లపల్లి, అవనిగడ్డ, , నాగాయలంక, కోడూరు, మోపిదేవి ఏఈలు మెండు సుగుణకుమారి, భోగాది జగత్, కేసన కిశోర్‌బాబు, ఎ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి




పెడన: పెడన, గుడివాడ ప్రధాన రహదారిలో పెడన శివారు తామర చెరువు సమీపంలోని డంపింగ్ యార్డు అంటుకోవడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో మంగళవారం ఉదయం అటుగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ఆర్టీసీ బస్సుల్లోని వారితో పాటు ఇతర ప్రయాణికులు సైతం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రోడ్డు కూడా సరిగ్గా కనిపించని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలోని పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా కావాలని అంటిస్తే అటువంటి చర్యలకు స్వస్తి పలకాలని, అనుకోకుండా అంటుకుంటే ఫైరింజన్ పిలిపించి ఆ మంటలను అదుపుచేయాలని చేయాలని ప్రయాణికులు, ఆస్పత్రి సిబ్బంది పురపాలక అధికారులకు విన్నవిస్తున్నారు.

భద్రాచలానికి 'శ్రీరామనవమి' ప్రత్యేక సర్వీసులు

అవనిగడ్డ: ఈ నెల 6వ తేదీ శ్రీరామ నవమిని పురస్కరించుకుని భద్రాచలానికి ప్రత్యేక బస్‌సర్వీసులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డీఎం హనుమంతరావు తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు గ్రూపులుగా వెళ్లదలిస్తే ఆయా గ్రామాలకు బస్సులను పంపి అక్కడ నుంచి భద్రాచలంకు తీసుకెళ్లనున్నట్టు డీఎం పేర్కొన్నారు.

కార్నియాల సేకరణ

నాగాయలంక: నాగాయలంకలో ఇడ్లీ బండి వ్యాపారి ప్రసాద్ మృతి చెందారు. మరొకరి కంటి చూపు ప్రసాదించే ఉద్దేశంతో భార్య లక్ష్మి, కుమార్తెలు ప్రవల్లిక, దేవిక ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. సుదర్శి మానవతా సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణకు సమాచారం అందించగా కంటి ఆస్పత్రి ఐ టెక్నీషియన్ సాయి, బృందం వచ్చి మృతుని నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకెళ్లారు.





భక్తిప్రపత్తులతో గంగానమ్మ జాతర



కోడూరు: కోడూరు గంగాభవాని ప్రధాన జాతరోత్సవాలు భక్తిప్రపత్తులతో కొనసాగుతున్నాయి. అమ్మవారి 50వ జాతరను పురస్కరించుకొని ఈ ఏడాది ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి అమ్మవారి ప్రధాన గుడి సంబరాన్ని నిర్వహించగా, మంగళవారం రాత్రి గ్రామోత్సవం ముగించి చిన్నఅమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై భారీ లైటింగ్‌తో ప్రభలను ఊరేగించి భక్తిభావం చాటుకున్నారు. యువకులు డీజే పాటలకు అనుగుణంగా తీన్మార్ డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్, ఎస్ఐ చాణిక్య పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది జాతరలో ఏవిధమైన అవాంఛనీయలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయం వద్ద పంబలవారి రుధిర పూజను భక్తిప్రపత్తులతో చేశారు. భక్తులు అమ్మవారి ముందు కత్తులు, వీరతాడులతో విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. ఆలయం వద్ద రంగవల్లులు తీర్చిదిద్ది శాంతిపూజలు చేశారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో గ్రామ ఆడపడుచులు, మహిళలతో పాలపొంగళ్ల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు చెప్పారు.

ఎంపీటీసీ, సర్పంచికి సత్కారం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): ముంబయిలోని థానే ప్రాంతంలో తెలుగు సమాఖ్య ఆధ్వర్యాన జరిగిన ఉగాది ఉత్సవంలో మోపిదేవి మండలంలోని కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణిలను సన్మానించారు. థానే ప్రాంతంలో కొన్నేళ్లుగా ముంబయిలో స్థిరపడిన తెలుగు ప్రజలంతా తెలుగు సమైక్యత సంస్థగా ఏర్పడి ఏటా తెలుగు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించిన సర్పంచ్, ఎంపీటీసీ దంపతులను సత్కరించారు.

పాస్టర్ మృతిపై పారదర్శక విచారణ చేయండి

కృత్తివెన్ను: పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా విచారణ చేయాలని క్రైస్తవ సంఘాల నేతలు కోరారు. పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా కృత్తివెన్ను మండలంలోని క్రైస్తవ సంఘాల నాయకులు, విశ్వాసులు ఆయా పాస్టర్ల ఆధ్వర్యాన మంగళవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వారు సంగమూడి వద్ద నుంచి216 జాతీయ రహదారిపై కృత్తివెన్ను తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్, కృత్తివెన్ను పోలీస్ స్టేషన్లలో వినతిపత్రాలు అందించారు. కృత్తివెన్ను పాస్టర్ల సంఘం అధ్యక్షుడు దానియల్‌రాజు, పాస్టర్లు ఎఫ్రా, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఘంటసాల: ఇటీవల పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పదంగా మృతి చెందిన విషయంలో నిజాలు నిగ్గుతేల్చాలని కోరుతూ ఘంటసాల మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రైస్తవుల ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు సెంటర్ నుంచి తహసీల్దార్, పోలీస్ స్టేషన్ వరకు శాంతియుత ర్యాలీ మంగళవారం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు, పోలీస్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.


అవనిగడ్డ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ దివి తాలూకా పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శాంతి ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, డీఎస్పీ విద్యశ్రీ, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. పాస్టర్స్ మోజెస్, డీఎస్ విజయ్‌కుమార్, కె.విజయ్‌కుమార్, రాజ్‌మనోహర్ నీల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

కె. కొత్తపాలెం(మోపిదేవి): పెదప్రోలు శివారు మట్టావాని గూడెం ప్రాథమిక పాఠశాలకు మంగళవారం కుర్చీలు వితరణగా ఇచ్చారు. కె. కొత్తపాలెం జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యార్లగడ్డ శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యంతో కుర్చీలు అందచేసినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం పద్మావతి తెలిపారు.

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

మచిలీపట్నంటౌన్: ఆప్కాస్ రద్దుచేసి పారుగు సేవల సిబ్బందిని ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వీడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బూర సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఏఐటీయూసీల రాష్ట్ర కమిటీల సంయుక్త పిలుపులో భాగంగా మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పట్టణాల పరిశుభ్రత కోసం విషవాయువుల మధ్య, అపాయకరమైన విధుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం 2025 మార్చి 6న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దుచేసి పారుగు సేవల సిబ్బంది నియమకాలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానించినట్లు బూర తెలిపారు. యూనియన్ పట్టణ నేత యర్రంశెట్టి ఈశ్వరరావు, సంఘనగర అధ్యక్షురాలు బుల్లెమ్మ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు సంజీవమ్మ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 47వ డివిజన్ ఈడేపల్లిలో మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం లబ్ధిదారుల ఇంటికే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. ఈడేపల్లిలోని కిడ్నీ బాధితుడు ఉయ్యూరు వీరభద్రరావు ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.30 వేల పింఛను రూపంలో మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి.. పులిచర్ల వీరకస్తూరి, తోట రాజ్యలక్ష్మి, పరింకాయల వెంకటేశ్వరమ్మలకు రూ.4 వేల చొప్పున వితంతు పింఛన్లు పంపిణీ చేశారు. . కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంరూరల్: మచిలీపట్నం మండల పరిధిలో 95% పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో చీపురుపల్లి వెంకటేష్ మంగళవారం తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి మచిలీపట్నం వాస్తవ్యులు కమ్మిల కృష్ణప్రసాద్, నాగ పద్మావతి దంపతులు మంగళవారం రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. దాతలకు ప్రసాదాలు అందజేశారు.

పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగులకు తప్పదు

పెడన: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని పెడన ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి పెడన తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న నెరుసు మస్తాన్ పదవీ విరమణ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. మస్తాన్ దంపతులను ఘనంగా సత్కరించి సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు శివారు ప్రశాంతి నగర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయ పడిన ఘంట వెంకట లక్ష్మి(48) చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించారు. మార్చి 27న లారీ ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకట లక్ష్మి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తికి గాయాలు

చల్లపల్లి: చల్లపల్లి–మచిలీపట్నం జాతీయ రహదారిలో పాతమాజేరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. పాగోలు గ్రామానికి చెందిన బోగాది శివరామకృష్ణ ప్రస్తుతం బోగిరెడ్డిపల్లిలో నివాసం ఉంటున్నాడు. తాపీ పని చేసే అతను ఇంటి తిరిగివచ్చేటప్పుడు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొట్టింది. వెంటనే 108 కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ప్రథమచికిత్స చేశారు. తర్వాత బందరు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.



